'చెత్త' రహదారులు

- ప్రధాన రోడ్డుపై చెత్తకుప్పలు
- పట్టించుకోని అధికారులు
- దుర్వాసనతో వాహనదారులకు ఇబ్బందులు


కొమలంచ శివారులో ప్రధాన రోడ్డు పక్కన చెత్తకుప్ప

నిజాంసాగర్(జుక్కల్) : బాన్సువాడ–ఎల్లారెడ్డి ప్రధాన రహదారి చెత్త, చెదారానికి నిలయంగా మారింది. ఈ రహదారిపై ఎక్కడ చూసినా చెత్తకుప్పలు, ప్లాస్టిక్ వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. పల్లె ప్రగతి కోసం టీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతీ గ్రామ పంచాయతీకి ట్రాక్టర్లు, ట్రాలీలను పంపిణీ చేసింది. అంతేకాకుండా జీపీల్లో సంపూర్ణ పారిశుధ్య పనుల నిర్వహణకు గాను మల్టీపర్పస్ వర్కర్లను నియమించారు. జీపీల్లో డంపింగ్ యార్డులన కూడా నిర్మించినా చెత్తపైన జీపీ కార్యదర్శులకు, ప్రత్యేక అధికారులు చిత్తశుద్ధి కరువైంది. బాన్సువాడ, ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై మహమ్మద్ నగర్ మండలంలోని గాలీపూర్, కొమలంచ, బూర్గుల్ గ్రామ శివారుల్లో రోడ్లపైన చెత్త కుప్పలు దర్శమనిస్తున్నాయి.

ప్రధాన రహదారిపై చెత్తతో పాటు ప్లాస్టిక్ వ్యర్థలను డంప్ చేయడంతో ప్రయాణీకులు, వాహన చోదకులు ముక్కుమూసుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. చుట్టు ప్రక్క గ్రామాలతో పాటు పట్టణాలను చెత్తను తీసుకొచ్చి ఈ రోడ్లపై పరవేస్తున్నారు. అంతేకాకుండా చికెన్ సెంటర్ల నిర్వాహకులు వ్యర్థాలను సంచుల్లో తీసుకొచ్చి రోడ్ల పక్కనే డంప్ చేస్తుండడంతో దుర్వాసనను దారిన పోయేవాళ్లు భరించలేకుండా ఉన్నారు.

పర్యవేక్షణ కరువు

సర్పంచుల పదవీకాలం ముగియగా జీపీల్లో ప్రత్యేక అధికారుల పాలన రావడంతో పాలన గాడి తప్పింది. జీపీలకు కేటాయించిన ప్రత్యేక అధికారులు జీపీలవైపు కన్నెత్తి చూడకపోవడంతో పారిశుధ్య పనులు పడకేశాయి. పంచాయతీల ట్రాక్టర్లు, మూలనపడటంతో పాటు మల్టీపర్పస్ వర్కర్లకు వేతనాలు సక్రమంగా చెల్లించకపోవడంతో వర్కర్లు విధులకు దూరమవుతున్నారు. జీపీల పాలనపై మండల పంచాయతీ అధికారితో పాటు ఎంపీడీవో, ప్రత్యేక అధికారుల పర్యవేక్షణ కరువైంది. దాంతో జీపీల్లో పారిశుధ్య పనులు అంతంత మాత్రంగా సాగుతున్నాయి. అధికారులు ఇకనైనా స్పందించి చెత్త సేకరణపై చిత్తశుద్ధి కనబర్చాలని ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

భిక్కనూరులో కాంగ్రెస్ ప్రచారం



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి మండలంలోని భిక్కనూరులో సొసైటీ వైస్ చైర్మన్ ప్రశాంత్‌గౌడ్ గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామ శివారులో జరుగుతున్న ఉపాధి పనుల వద్ద వైస్‌చైర్మెన్ ఎన్నికల ప్రచారం చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షెట్కార్‌ను ఎంపీగా గెలిపించాలన్నారు. సొసైటీ డైరెక్టర్ సుభేందర్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు చెన్న లక్ష్మణ్ తదితరులున్నారు.

ప్రత్యేక శిబిరంలో స్వచ్ఛభారత్



బిచ్కుంద(జుక్కల్) : మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ జాతీయ సేవాపథకం యూనిట్–1, యూనిట్–2 ఆధ్వర్యంలో డిగ్రీ ద్వితీయ తృతీయ సంవత్సర విద్యార్థులు గురువారం మండలంలోని పుల్కల్, పెద్ద దేవాడ గ్రామాల్లో ప్రత్యేకశిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చంద్రముఖర్జీ, కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జీ వెంకటేశం, సంజీవ్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు



లింగంపేట(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల అభివృద్ధిలో అమ్మ ఆదర్శ కమిటీల భాగస్వామ్యంతో మౌలిక సదుపాయాల కల్పన చేపట్టనున్నట్లు కాంప్లెక్స్ హెచ్ఎం షౌకత్ అలీ తెలిపారు. పాఠశాలల్లో విద్యార్థులకు కావాల్సిన సౌకర్యాలను అమ్మ ఆదర్శ కమిటీలు భాగస్వాముపై పనులు చేయించాలన్నారు. 2024–2025కు గాను విద్యార్థుల సంఖ్యను పెంచాల్సిన బాధ్యత కమిటీలపై ఉందన్నారు. ప్రభుత్వం నుంచి విడుదలైన నిధులతో ఆదర్శ కమిటీల పర్యవేక్షణలో పనులు చేయించాలన్నారు. ఐకేపీ సీసీ మేహార్, టీచర్లు, గంగాధర్, యూసుఫ్, అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మహిళా శక్తి సమ్మేళనానికి బీజేపీ కార్యకర్తలు



రామారెడ్డి : జహీరాబాద్ పార్లమెంట్ మహిళా శక్తి సమ్మేళనానికి సదాశివనగర్ మండల కేంద్రం నుంచి బీజేపీ మహిళా కార్యకర్తలు తరలి వెళ్లారు. ఆందోల్ నియోజకవర్గం పాల్వంచలో గురువారం నిర్వహించ తలపెట్టిన మహిళ శక్తి సమ్మేళనానికి తరలివెళ్లినట్లుగా సదాశివనగర్ బీజేపీ మహిళా అధ్యక్షురాలు దీవిశెట్టి రజిత తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మహిళా ప్రధాన కార్యదర్శి మల్లకొండ విమల తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపు కోసం కృషిచేయండి



పిట్లం(జుక్కల్): వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా నాయకులు, ప్రతి ఒక్క కార్యకర్త పని చేయాలని జహీరాబాద్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్ కోరారు. ఆయన గురువారం మండల కేంద్రం అయిన పిట్లంలో కాంగ్రెస్ పార్టీ నాయకులకు కలిసి మాట్లాడారు. తనను ఎంపీగా అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మోహన్‌రెడ్డి, గంగారం, శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

మాల్తుమ్మెదలో మామిడి తోట వేలం

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : నాగిరెడ్డిపేట మండలంలోని మాల్తుమ్మెద ఉద్యాన క్షేత్రములో మామిడి చెట్లకు ఈనెల 24న వేలం నిర్వహించనున్నట్లు ఉద్యాన శాఖ అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 20 ఎకరాల ప్రభుత్వ ఉద్యాన క్షేత్రంలో గల మామిడి తోటకు ఈనెల 24న ఉదయం 11 గంటలకు వేలం పాట నిర్వహిస్తామని, ఆసక్తి ఉన్న రూ. 1000 చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు.

ఆధ్యాత్మికం

వనదుర్గ పెద్దమ్మ ఉత్సవ విగ్రహం ఊరేగింపు



భిక్కనూరు : మండలకేంద్రంలో వనదుర్గ పెద్దమ్మ ఆలయం 25వ వార్షికోత్సవ ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. గురువారం మండల కేంద్రంలో భాజాభజంత్రీలతో వనదుర్గ పెద్దమ్మ ఉత్సవ విగ్రహాన్ని మండల కేంద్రంలో ఊరేగించారు. ఈ సందర్భంగా పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. మహిళలు అమ్మవారి విగ్రహానికి మంగళహారుతులతో స్వాగతం పలికారు. శుక్రవారం ఆలయం ప్రాంగణంలో పెద్దమ్మ–పెద్దిరాజుల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ముదిరాజు సంఘం అధ్యక్షుడు బండి రాములు తెలిపారు.

హనుమాన్ స్వాముల పాదయాత్ర



నిజాంసాగర్(జుక్కల్): హనుమాన్ మాలలు ధరించిన అంజన్నస్వాములు గురువారం జుక్కల్ మండలం నుంచి కొండగట్టులో అంజన్న సన్నిధికి పాదయాత్ర ప్రారంభించారు. బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణాతార పాదయాత్రను ప్రారంభించారు. జుక్కల్ మండలం నాగుల్‌గావ్ గ్రామంలో హనుమాన్ స్వాములకు నాయకులు కపిల్‌పటేల్, రవి పటేల్ పండ్లను పంపిణీ చేశారు.

కొండగట్టుకు..



రాజంపేట : కొండగట్టు ఆంజనేయ స్వామి దీక్ష తీసుకున్న స్వాములు పాదయాత్ర తో కొండగట్టు ఆంజనేయ స్వామి వారిని దర్శించు కోవడానికి రాజంపేట మీదుగా పాదయాత్ర కొనసాగిస్తున్నారు. లింగంపేట మండలం పోల్కంపేటకు చెందిన స్వాములు కోటాలపల్లి వరకు చేరుకున్నారు. సుమారు 130 కి.మీ పాదయాత్ర చేస్తున్నామన్నారు. పాదయాత్రలో తలారి యాదగిరి, పిట్ల వెంకటేష్, ఎల్లయ్య, అభిలాష్, రమేష్, నరేష్, దీవిటి చింటు, బండారి సురేందర్ రెడ్డి ఉన్నారు.

రామాలయం వద్ద ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన



నిజాంసాగర్(జుక్కల్) : మహమ్మద్ నగర్ మండలంలోని సింగితం గ్రామంలో గురువారం ధ్వజస్తంబ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అర్చనలు, హోమాలు, ప్రత్యేక పూజలు చేసి ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు రాముల పంతులు, రాధమ్మ, శ్రీధర్ రెడ్డి, శంకర్‌రెడ్డి, నారాయణరెడ్డి, అనిల్ తదితరులు ఉన్నారు.

ముగిసిన అఖండ హరినామ సప్తాహం



పిట్లం(జుక్కల్): మండలంలోని రాంపూర్‌లో వారం రోజులుగా నిర్వహిస్తున్న అఖండ హరినామ సప్తాహ కార్యక్రమం గురువారంతో ముగిసిందని గ్రామస్థులు పేర్కొన్నారు. గ్రామంలోని శ్రీరామాలయం వద్ద పోచయ్య మహరాజ్ ఆధ్వర్యంలో 7 రోజుల పాటు తీరొక్క భజనలు నిర్వహించడం జరిగిందన్నారు. భక్తులకు పోచయ్య మహారాజ్ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండలంలోని కృష్ణాజీవాడి శివారులో మార్కండేయుడి ఆలయ నిర్మాణానికి గురువారం భూమి పూజ చేశారు. పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఈ ఆలయ నిర్మాణానికి ఆలయ కమిటీ సభ్యులు, పద్మశాలి సంఘం సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సీతారాముల రథోత్సవం



నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండల కేంద్రంలో గురువారం సీతారాముల ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రథంలో స్వామి వారి ఉత్సవ విగ్రహాలను గ్రామంలోని వీధుల్లో శోభాయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అరిగె నారాయణ, గ్రామ కమిటీ చైర్మన్ కంది మల్లేష్, గ్రామస్తులు ఇల్లెందుల సాయాగౌడ్, గుత్తుల శ్రీనివాస్, మహేందర్ గౌడ్, అరిగె సాయిలు తదితరులున్నారు.

ఘనంగా పెద్దమ్మ ఉత్సవాలు ప్రారంభం



దోమకొండ : మండల కేంద్రంలోని పెద్దమ్మ ఆలయంలో అమ్మవారి ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం అమ్మవారికి అభిషేకాలు,అలంకరణ, సాయంత్రం ఎడ్లబండ్ల ప్రదర్శన నిర్వహించారు. 19న శుక్రవారం పెద్దమ్మ పెద్దిరాజుల కల్యాణం, మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఉంటుంది. 20న శనివారం అమ్మవారికి బోనాల సమర్పణ ఉంటుంది. 21న ఆదివారం తిరుగుబోనాలతో ఉత్సవాలు ముగుస్తాయని ఆలయకమిటీ అధ్యక్షుడు పున్న లక్ష్మన్ తెలిపారు. కార్యక్రమంలో ఆలయకమిటీ ప్రతినిధులు అబ్రబోయిన పెద్ద బాలయ్య, బొయిని సత్యం, నాగారపు రాజు, కామిండ్ల నర్సింలు, కామిండ్ల కృష్ణ, జెడ్పీటీసీ సభ్యులు తీగల తిర్మల్‌గౌడ్ పాల్గొన్నారు.

నియామకం



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : కాంగ్రెస్ తాడ్వాయి మండల ప్రధాన కార్యదర్శిగా బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన ఏడి నర్సారెడ్డిని నియమించినట్లు పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి తెలిపారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ ఆదేశాల మేరకు నర్సారెడ్డిని ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు.

మక్కా యాత్రికులకు సన్మానం



బాన్సువాడ : బాన్సువాడ నుంచి మక్కా మదీనకు వెళ్లే ముస్లింలకు గురువారం బాన్సువాడలో మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్‌లు సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మోరియల్ శ్రీనివాస్‌రావు, పాత బాలకృష్ణ, అక్బర్ తదితరులున్నారు.

నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలి



కామారెడ్డి రూరల్ : గ్రామాల్లో వేసవి కాలంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ఆయా జీపీల కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని ఎంపీవో మలహరి ఆదేశించారు. గురువారం ఆయన మండలంలోని ఇస్రోజీవాడి గ్రామంలోని డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద, నర్సరీ, గ్రామంలో పర్యటించారు. నీటిని పొదుపుగా వాడుకోవాలన్నారు. అనంతరం హైస్కూల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కింద చేపడుతున్న పనులను పరిశీలించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాస్, గ్రామ కార్యదర్శి మౌనిక, కారోబార్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

రుక్మిణీ విఠలేశ్వర విగ్రహ ప్రతిష్ఠాపన

బాన్సువాడ రూరల్ : మండలంలోని కోనాపూర్ గ్రామంలో పునర్నిర్మించిన శ్రీ రుక్మిణి విఠలేశ్వర మందిరంలో గురువారం విగ్రహ, శిఖర ప్రతిష్ఠాపన మహోత్సవాలు ప్రారంభం అయ్యాయి. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మండపంలో హైదరాబాద్‌కు చెందిన వేదపండితులు గోవిందుగారి ప్రణీత్‌శర్మ, కోనాపూర్‌కు చెందిన జోషి కిషన్‌పంతులు సంయుక్త ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. గురువారం అన్నదానం నిర్వహించారు.

కాంగ్రెస్‌లో భారీ చేరికలు



పార్టీలో చేరుతున్న సీనియర్ నాయకుడు నిమ్మ మోహన్ రెడ్డి, మాజీ సర్పంచ్ కాశయ్య

కామారెడ్డి రూరల్ : కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నిమ్మ మోహన్‌రెడ్డి గురువారం ప్రభుత్వ సలహాదారుడు మహ్మద్ షబ్బీర్‌అలీ, జహీరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షెట్కార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీ కండువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు గూడెం శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, నిమ్మ విజయ్‌కుమార్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

నిజాంసాగర్ నుంచి..

నిజాంసాగర్(జుక్కల్) : నిజాంసాగర్, మహమ్మద్ నగర్ మండలాలకు చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు గురువారం జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మహ మ్మద్ నగర్, తున్కిపల్లి, ముగ్దుంపూర్, మల్లూర్, మల్లూర్‌తండా గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మాజీ సర్పంచులు, మాజీ ఉప సర్పంచులు కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు, ఆగ్రో చైర్మన్ కాసుల బాల్‌రాజ్ పార్టీలోకి ఆహ్వానిచారు.


ఎమ్మెల్యే మదన్‌మోహన్‌తో సొసైటీ డైరెక్టర్ మధుకర్

ఎమ్మెల్యే సమక్షంలో..

రామారెడ్డి : ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ సమక్షంలో సదాశివనగర్ మండలం తిమ్మాజీవాడ మాజీ ఉపసర్పంచు సాకలి రాజయ్య గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో వైఎస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, లింగాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి సొసైటీ డైరెక్టర్..

రాజంపేట : రాజంపేట మండలంలోని ఆర్గొండ పీఏసీఎస్ డైరెక్టర్ తోట మధుకర్ ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎర్ర ప్రణీత్ రెడ్డి, జనరల్ సెక్రటరీ అల్లకొండ సంతోష్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

రోగులకు వైద్యం అందించాలి



మద్నూర్(జుక్కల్) : వైద్య సిబ్బంది రోగులకు ఎల్లప్పుడు వైద్య సేవలు అందించాలని డోంగ్లీ పీహెచ్‌సీ వైద్యురాలు శ్రీలేఖ తెలిపారు. మండల కేంద్రంలోని సబ్ సెంటర్‌ను గురువారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సబ్ సెంటర్‌లోని రికార్డులకు ఆమె పరిశీలించారు. ప్రస్తుతం వేసవి కాలం సందర్భంగా ప్రజలకు జాగ్రత్త చర్యలు సూచించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఉన్నారు.

మండల సమావేశం వాయిదా



మద్నూర్(జుక్కల్) : ఎంపీటీసీల కోరం లేకపోవడంతో జనరల్ బాడీ సమావేశం వాయిదా వేసినట్లు ఎంపీడీవో పరుచూరి రాణి తెలిపారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం వరకు సభ్యులు హాజరుకాకపోవడంతో సమావేశం వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో ప్రకటించారు. త్వరలోన తేదీని ప్రకటిస్తామన్నారు. ఎంపీపీ లక్ష్మీబాయి, పలుశాఖల అధికారులు ఉన్నారు.

బీజేపీ ఇంటింటి ప్రచారం


తాడ్వాయిలో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు


ఎల్లారెడ్డిలో..


కిష్టాపూర్..

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలో గురువారం బీజేపీ నాయకులు ఇంటింటికీ తిరుగుతూ ఎన్నికల ప్రచారం చేశారు. ప్రధాని మోదీ చేస్తున్న అభివృద్ధి పనుల గురించి ప్రజలకు వివరించారు. జహీరాబాద్ పార్లమెంటు బీజేపీ అభ్యర్థి బీబీపాటిల్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, స్వామిరెడ్డి, దత్తు, రాజు, మహేష్, పవన్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

పిట్లం మండలంలో..

పిట్లం(జుక్కల్): మండలంలోని కిష్టాపూర్, హస్నపూర్ గ్రామాలలో బీజేపీ పార్టీ నాయకులు గురువారం ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. బీజేపీ నాయకులు జగదీష్ మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ పార్టీకు ఓటు వేసి ఎంపీగా బీబీ పాటీల్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ పార్టీ మండల అధ్యక్షుడు అభినయ్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు వడ్ల శివ, నాయకులు తదితరులున్నారు.

ఎల్లారెడ్డిలో..

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డిలో బీజేపీ నాయకులు ఇంటింటా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. గురువారం పట్టణంలోని దుకాణాలు, ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించి బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్‌కు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు దేవేందర్, బాలకిషన్, సతీష్ తదితరులున్నారు.

విద్యార్థులకు నేత్ర పరీక్షలు



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : పట్టణంలోని మైనారిటీ బాలుర గురుకుల పాఠశాలలో విద్యార్థులకు గురువారం కంటి పరీక్షలు నిర్వహించారు. ఆప్తాల్మిక్ వైద్యులు డాక్టర్ హరికిషన్ విద్యార్థులకు కంటి పరీక్షలను నిర్వహించి మందులను అందించారు. మత్తమాల పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శరత్, ప్రిన్సిపల్ సుధాకర్ తదితరులున్నారు.

చలివేంద్రం ప్రారంభం



నిజాంసాగర్(జుక్కల్) : మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో స్థానిక ఎస్సై సత్యనారాయణ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. వివిధ కేసుల్లో పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదు దారుల దాహార్తి తీర్చేందుకోసం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు అస్పత్ వార్ వినోద్, కపిల్ పటేల్, సాయికర్ణ, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

సంక్షిప్తం

విద్యుత్ సమస్యలపై ఫిర్యాదు చేయాలి

పెద్దకొడప్‌గల్(జుక్కల్) : విద్యుత్ వినియోగదారుల విద్యుత్ సమస్యలపై ఫిర్యాదు చేయాలని ఇన్‌చార్జి ఏఈ సాయినాథ్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని స్థానిక విద్యుత్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక జరుగుతుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కోచింగ్ సెంటర్‌లపై చర్యలు తీసుకోండి

కామారెడ్డి టౌన్ : అనుమతులు లేని కోచింగ్ సెంటర్‌లపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర కోశాధికారి సురేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. జిల్లా కేంద్రంలో సాందీపని కళాశాల ఎదురుగా ఎలాంటి అనుమతులు లేకుండా, అనుభవం లేకి వ్యక్తులతో కోచింగ్ సెంటర్ నిర్వహిస్తున్నారని తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అంబులెన్స్ ఆకస్మిక తనిఖీ



కామారెడ్డి టౌన్ : జిల్లాలోని అంబులెన్స్‌ను పశుసంచార అంబులెన్సుల ప్రాజెక్టు సమన్వయకర్త డాక్టర్ భగీష్ మిశ్రా గురువారం జిల్లా కేంద్రంలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్య సేవల్లో నాణ్యత ప్రమాణాలను పాటించి, మూగజీవాలకు మెరుగైన సేవలను అందించాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా వాహనాల్లోని పరికరాలు, మందులు, రికార్డులను పరిశీలించారు. సిబ్బంది అందిస్తున్న సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పీఎం రవి, ఈఎంఈ లింగాచారి, పైలట్ గంగాధర్, పారావెట్ రమ్య, హెల్పర్ సుధాకర్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

ఫిజియోథెరపీతో సత్ఫలితాలు

బాన్సువాడ రూరల్ : శారీరక వికలాంగులైన విద్యార్థులకు ప్రతిరోజు ఫిజియోథెరపీ చేయడంతో సత్ఫలితాలు వస్తాయని బాన్సువాడ ఎంఈవో నాగేశ్వరరావు అన్నారు. గురువారం భవిత కేంద్రంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన విద్యార్థులకు ఫిజియోథెరపిస్ట్ గంగాధర్ ఫిజియోథెరపీ చేశారు. అలాగే విద్యార్థులకు ట్రావెలింగ్ అలవెన్సులు అందజేశారు. ఆయన వెంట ఐఈఆర్‌పీ వసంత్ కుమార్, వెంకట పద్మ సిబ్బంది ఉన్నారు.

క్యాన్సర్ నిర్ధారణ శిబిరం

బాన్సువాడ రూరల్ : మండల కేంద్రంలోని యశోద ఆస్పత్రిలో గురువారం గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య, క్యాన్సర్ నిర్ధారణ శిబిరం నిర్వహించారు. శిబిరానికి హాజరైన రోగులను వైద్యులు పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. క్యాన్సర్ పరీక్షల్లో పాజిటివ్ వచ్చిన వారికి తదుపరి పరీక్షల కోసం రిఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ బాన్సువాడ ప్రతినిధులు, ఆర్ఎంపీ, పీఎంసీ తెలంగాణ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, వైద్యులు పాల్గొన్నారు.